
రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లేదు దొరకు. ఆ రోజుదయం అతడు జొన్న చేలో కలుపు తీస్తోంటే, పోస్ట్ మేన్ నారాయణ వచ్చి ఓ ఉత్తరం అందించాడు. కేవలం ఉత్తరం అందించడమే కాకుండా ఆ ఉత్తరాన్ని తిరిగి అందుకుని అతడి ఎదురుగానే చించి, చదివి అందులోని విషయాన్ని వివరించాడు.

# ఆలంబన

సీతాసత్య



నారాయణ మాట లింకా పూర్తి కాకుండానే అతడి భుజాలు పట్టుకుని ఊపేస్తూ, "నాకూ జ్జోగం వత్తందన్నమాట. నేనూ నీలాగే ఉజ్జోగత్తుణ్ణి అవుతానన్న మాట" అన్నాడు దొర, లోపల్నించి ఆనందం వెల్లువలా తన్నుకొస్తోండగా.

నారాయణ మందహాసం చేసి 'రే పుదయం పదిన్నరకు నువ్వు ఇంటర్వ్యూకి హాజరు కావాలి. ఉదయాన్నే లేచి ఏడున్నర కల్లా దేవుడి వాగు దగ్గరకు చేరుకున్నా వంటే పట్నం వెళ్లే బ స్సొస్తుంది. అదెక్కితే మరో అర గంటలో పట్నంలో ఉంటావు' ' అని "పట్నం నుంచి మంచి కబురు తీసుకు రావాలి సుమా!" అంటూ అక్కడి నుంచి కదిలాడు.

నారాయణ వచ్చి వెళ్లినప్పటి నుంచీ దొర మనసు మనసులో లేదు. ఎన్నా డెప్పుడు తెల్ల వారుతుందా, త నెప్పుడు పట్నం వెళ్లి ఉద్యోగం సంపాదించుకుంటాడా? అనే ఆలోచన అతడి బుర్రను తొలిచేస్తోంది.

ఆ చుట్టు పక్కల ఉన్న పద్దెనిమిది గూడేల్లోనూ ఎక్కువగా చదువుకున్న వాడు దొర ఒక్కడే. తమ గూడేనికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కి రోజూ నడిచి వెళ్లి చదువుకున్నాడు దొర. పనిపాటల్లో సాయం చేయ వలసిన కొడు కీ విధంగా ఏబ్రాసి వాడిలా రోజూ ఉదయాన్నే నడిచి వెళ్లి, వేలాడుతున్న మొహంతో కాళ్లీడ్చుకుంటూ సాయంత్రానికి తిరిగి రావడం దొర తండ్రి కెంత మాత్రమూ ఇష్టం ఉండేది కాదు.

కానీ సత్యం మాస్టారి ప్రోద్బలంతో తండ్రి మాటను పెడ చెవిన పెట్టి, చదువు మీదే దృష్టిని కేంద్రీకరించాడు. దొర. పదో తరగతి పాసయ్యాక అంతటితో ఆపకుండా ఇంకా పై చదువులు చదవాలనుకున్నాడతను. తండ్రి నుంచి ఎటువంటి సమర్థింపూ ఉండదని తెలిసినా పట్నంలో ఉన్న కాలేజీకి దరఖాస్తు పెట్టాడు. సీటు కూడా వచ్చింది.

కానీ అన్నీ సిద్ధం చేసుకుని బయల్దేరే సమయానికి అతడి తండ్రికి పక్షవాతం వచ్చి ఓ కాలూ, చేయీ పడి పోయాయి. చెల్లెలు చిన్నది. నోట్లోకి నాలుగు వేళ్లూ కాక పోయినా, కనీసం రెండు వేళ్లయినా వెళ్లాలంటే, ఉన్న కాస్త భూమినీ సాగుచేయడంలో తల్లికి సాయం చేయడం వినా వేరే గత్యంతరంలేని పరిస్థితుల్లో, చదువు కక్కడితో మంగళ హారతి పాడి, సత్యం మాస్టా రిచ్చిన సలహాతో జిల్లా కేంద్రంలో పేరు నమోదు చేయించుకుని, తనను వెదుక్కుంటూ రాగల అవకాశం కోసం కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నాడు దొర.

పదో తరగతి పాసైన రెండేళ్లకు.... అతడి కొచ్చిన మొదటి పిలుపు అది. అందుకే గుండె నిండిన సంతోషంతో ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లే దతడికి.

తెల్లవారు జామున గుడిసె బయట అలికి డైతే లేచి కూర్చున్నాడు దొర. గుడిసె కడ్డుగా కట్టిన తడిక దగ్గర చప్పుడు వినిపించిం దతడికీ సారి. లేచి నిలబడి ద్వారం వరకూ నడిచి, తడికను




తప్పించి బయటకు అడుగు పెట్టాడు దొర. చుట్టూ దట్టంగా ఉన్న చెట్టు మీది నుంచి వీచిన గాలి, చల్లగా రివ్వున అతడి దేహాన్ని తాకింది. ఆ చీకట్లో కళ్లు విప్పార్చుకుని చూశాడు. ఏమీ కనిపించ లేదు.

తను పొర బడ్డాడేమో అనుకుని తిరిగి లోపలికి పోబోయాడు.

అంతలో వినిపించిం దతడికి 'ఘల్'మన్న శబ్దం.

అర్థమై పోయిం దతడికి. చీకట్లోనే రెం డడుగులు ముందుకు వేసి చేయి చాచాడు. అతడి చేతి కేమీ తగలక పోగా ' ఘల్....ఘల్!' అని రెండు సార్లు వినిపించిం దీ సారి. నాలు గడుగులు ముందుకు వేశాడు దొర.

'ఘల్...ఘల్...ఘల్....ఘల్...' మని వినిపించింది మళ్లీ. అతడి పెదాల మీద నవ్వు వెలసింది. 'సెంబూ!'అని పిలిచాడు.

"ఊ"... అని పలికింది, సెంబూ అనే శాంభవి. మరో నాలు గడుగులు ముందుకు వేశాడు. ఈ సా రతడికి ఘల్‌ఘల్ శబ్దాలకు బదులుగా శాంభవి చేయి తగిలింది.

"పట్నం వెల్తన్నావంటగా!" అంది శాంభవి అతడి చేతులు పట్టుకుని.

"ఊ" అన్నాడు దొర.

"మరైతే తిరిగొచ్చాక లగ్గం కాయమేగా?" అంది శాంభవి. ఆ చీకట్లో కూడా ఆమె గొంతు సిగ్గుతో వణికింది.

దొర ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే అతడికి పెళ్లి చేసేద్దామని చూశా రతడి తల్లిదండ్రులు. కానీ దొర మొండి పట్టు పట్టడంతో చేసేది లేక ఊరుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక మరో సారి ప్రయత్నించి భంగపడి, ఇక ఆ విషయం వదిలేశారు వాళ్లు.

గానీ శాంభవి మాత్రం రెండేళ్ల నుంచీ అతడి మీద ఆశలు పెంచుకుంది. దొరకూ తనంటే ఇష్టమేనని తెలిశాక శాంభవి అతణ్ని తొందర చేయడం ప్రారంభించింది.

"ఏమైనా సరే, నా కుజ్జోగం దొరికే వరకూ మనువు సంగతి ఎత్తమాక!' అని దొర కచ్చితంగా చెప్పడంతో, 'ఉజ్జోగం ఎప్పు డొత్తదో, దొర తనను మను వాడే దెప్పుడో?' అనుకుంటూ కాలక్షేపం చేస్తూ వచ్చిం దింత కాలమూ.

ఉద్యోగం కోసమే దొర మర్నాడు పట్నం వెళ్ల బోతున్నాడని తెలియడంతో అతడి కంటే ఎక్కువ సంబర పడింది శాంభవి. ఆమె కా కబురు చీకటి పడ్డాక తెలిసింది. తెల్ల వారితే దొర ఊరు దాటేస్తాడని, ఇంకా వెలుగు రాకుండానే తమ మనువు సంగతి గుర్తు చేద్దామని వచ్చిం దామె.

"ఏం మాట్టాడవే? నువ్ పట్నం నుంచొచ్చాక లగ్గం కాయమేగా?"

ఆమెకేం చెప్పాలో తెలియక నిట్టూర్చాడు దొర. "అదేంటే, నీ కుజ్జోగం వచ్చిందని నారాయణ చెప్పాడు కాదా?" అందిశాంభవి.

"అట్టాగేలే " అన్నాడు దొర.

* * *

పట్నంలో బస్సు దిగి నలుగు రైదుగుర్ని వాకబు చేసి ఇంటర్వ్యూ జరిగే ఆఫీస్‌కు వెళ్లాడు దొర. అత డక్కడికి వెళ్లే సరికి, అప్పటికే సుమారు పాతిక మంది వరకూ కుర్రా ళ్లక్కడ ఉన్నారు. అందరి చేతుల్లోనూ ప్లాస్టిక్ కవర్లలా ఉన్న పొడవాటి పుస్తకా ల్లాంటి వాటిని చూశాడు దొర.

'ఈ ళ్లంతా ఎందు కొచ్చారో? తనలాగే ఉజ్జోగానికి కాదు గదా?' అనిపించి గుండె జల్లుమంది అతనికి. ఈ లోగా ఆ వరండాలో ఓ బల్ల ముందు కూర్చున్న వ్యక్తి, " మీ సర్టిఫికెట్లు చూపించడం ప్రారంభించండి" అన్నాడు అందర్నీ ఉద్దేశించి.

ఒక్కొక్కరూ అతడి దగ్గరకు వెళ్లి, రెక్సిన్ ఫోల్డర్ జిప్ లాగి అందు లోంచి సర్టిఫికెట్స్ తీసి చూపించడం ప్రారంభించారు. దొర కూడా అతడి దగ్గరకు వెళ్లాడు. పాంటు జేబులో చెయ్యి పెట్టి నాలుగైదు మడతలు పడిన కాగితాన్ని బయటకు తీసి అతడి కందించ బోయాడు.

అతడో సారి దొర వైపు ఎగాదిగా చూసి, "ఏమిటిది? మినిస్టర్ గారి రికమెండేషన్ లెటరా?' ' అన్నాడు వెటకారంగా అక్కడున్న వాళ్లంతా ఘొల్లున నవ్వారు.

దొర తలెత్తి వారి వైపు చూశాడు. వాళ్లంతా ఇస్త్రీ బట్టల్లో చక్కగా శుభ్రంగా ఉన్నారు. తన వైపో సారి చూసుకున్నాడు. నలిగిన ప్యాంటు, ముడతలు పడిన చొక్కా, జిడ్డు కారుతోన్న మొహం... తనను చూస్తే తనకే చిన్నతనంగా అనిపించిం దతడికి.

"కాదండీ, సర్టిఫికెట్, పదోతరగద్ది" అన్నాడు. చేతిలోని సర్టిఫికెట్‌ను మడతలు విప్పి చూపిస్తూ, దాంతో పాటు జేబు లోంచి మరో కాగితం కూడా తీసి చూపించాడు దొర.

తిరస్కార భావంతో వాటివైపు చూసిన అతడు కళ్లు పెద్దవి చేసి," కొండోడి వన్న మాట"అని తన దగ్గరున్న లిస్ట్‌లో టిక్ పెట్టుకున్నాడు.

మరో అర గంటలో ఇంటర్వ్యూ ప్రారంభమైంది, ఒక్కొక్కరే లోపలికి వెళ్లి అయిదు నిముషాల్లో తిరిగొచ్చేస్తున్నారు. ఒకానొక సమయంలో తన నసలు లోపలికి వెళ్లనిస్తారా? అని సందేహం వచ్చింది దొరకు.

'ఎందుకు పిలవరు? అయినా ఆళ్లేగా తనను రమ్మని కాయితం పంపిందీ?" అని మనసును సమాధాన పరచుకున్నాడు. అతడు తన ఆలోచనల్లో ఉండగానే వచ్చిన వారందరూ వెళ్లి పోయారు. అత డొక్కడే మిగిలిపోయాడు.

అతడి సర్టిఫికెట్ చూసిన వ్యక్తి "లోపలికి వెళ్లు" అన్నాడు. మడతలు పెట్టిన సర్టిఫికెట్‌ను చేత్తో పట్టుకుని లోపలకు వెళ్లాడు దొర.

ఆ గది చాలా పెద్దదిగా ఉంది. దాని వెనుక కుర్చీల్లో నలుగురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. అంతా పరిశీలనగా చూశారు, లోపలికి వస్తోన్న దొరను.

వారి వైపు చూసి, "దండాలం..." అనబోయి, చదువుకునే రోజుల్లో తన కెంతగానో అభిమానించే సత్యం మాస్టారు చెప్పిన మాటలు గుర్తొచ్చి, "నమస్కారం సార్" అని ఒకరి కంటే ఎక్కువ మంది ఉన్నారు కదా? అని, "నవ... నమస్కారాలు సార్" అన్నాడు దొర, రెండు చేతులూ జోడించి.


అందరిలోనూ మధ్యగా కూర్చున్నా యన "నవస్కారం .. ఇలా వచ్చి కూర్చో" అన్నాడు తమ ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ. ఆ కుర్చీవరకూ వెళ్లాడు కానీ కుర్చీలో కూర్చుందుకు చాలా సిగ్గు పడిపోయాడు దొర.

అతడు సర్దు క్కూర్చున్నాక ఒక్కొక్కరూ బాణాలు సంధించా రతడి మీద. తమ గూడెం వాళ్లంతా వేటకు వెళ్లినప్పుడు నాలుగు వైపుల నుంచీ బాణాలతో దుప్పినో, కణుజానో కొట్టినపుడు, అవి బాధతో ఎలా గిజగిజలాడి పోయేవో అనుభవంలోకి వచ్చింది దొరకు. ఇహెప్పుడూ జన్మలో వేటకు వెళ్ల కూడదని మనసులో ఒట్టు పెట్టుకున్నాడు ఆక్షణంలో.

"నీ పూర్తి పేరేవిటి? మీ ఊ రిక్కడి కెంత దూరం? మీ గూడెం చుట్టూ అడవిలో ఉండే చెట్ల పేర్లేవిటి? మిరేం పంటలు పండిస్తారు?' వంటి మామూలు ప్రశ్నలతో ప్రారంభించి, "నీకు ప్రధాన మంత్రంటే ఇష్టమా? ప్రసిడెంటంటే ఇష్టమా? అమెరికా అధ్యక్షుడికీ, మీ గూడేం పెద్దలకూ పోలి కేవిటి? నక్సలైట్లు మంచాళ్లా? పోలీసులు మంచాళ్లా? అయోధ్యలో రామాలయం కడితే మంచిదా? మసీదు కడితే మంచిదా? కోడి గుడ్డుకూ, బాతు గుడ్డుకూ ఉన్న సంబంధం ఏవిటి?" వంటి తూణీరాల్తో అతడి మెదడును చిన్నాభిన్నం చేసేసి, "ఇక ను వ్వెళ్లొచ్చు" అన్నారు.

'త నుజ్జోగం చేయాలంటే ఇన్ని ఇసయాలు తెలుసుకుని ఉండాలా?' అనే ఆలోచనలతో బుర్రంతా గజిబిజిగా అయిపోయింది దొరకు. అందరికీ చేతులు జోడించి ఆ గదిలోంచి బయట పడ్డాడు.

తన కా ఉద్యోగం వస్తుందో రాదో తెలియడం లేదు. ఎవరు చెవుతారు తనకా ఇసయం?



వరండాలో నడుస్తూ ఆలోచిస్తోన్న దొర దగ్గరకు వచ్చాడు, అతడి సర్టిఫికెట్ చూసిన వ్యక్తి. " పద" అన్నాడు దొరతో.

ఆశ్చర్యంగా అతడి వైపు చూసిన దొర మొహంలోకి పరీక్షగా చూసి, "నాతోరా" అని ముందుకు నడిచా డా వ్యక్తి.

అతడి ననుసరించి దగ్గర్లో ఉన్న ఓ పాక హోటల్‌కి ప్రవేశించాడు దొర. దొరను కూర్చోమని త నతడి ఎదురుగా కూర్చుని, "ఇడ్లీ తింటావా?" అన్నా డతడు.

"ఊహూ" అని తల అడ్డంగా ఆడించాడు మొహమాట పడుతూ.

అతడు ఇడ్లీ తెప్పించుకు తిని, "దోసె తింటావా ?'అన్నాడు. దొర మళ్లీ తల అడ్డంగా ఊపాడు సిగ్గు పడుతూ.

అతడు దోసె తినడం పూర్తి చేసి 'పూరీ తింటావా?' అ నడిగి, ఈ సారి దొర సమాధానం కోసం చూడకుండా పూరీ, వడా, పెసరట్ తినేసి, కాఫీ కూడా తాగి అన్నాడు, "నువ్వు కొండ జాతోడివి అంటే యస్టీ వోడి వన్న మాట. ఈ రోజు వచ్చిన వాళ్లలో నువ్వొక్కడివే యస్టీ వోడివి. మొత్తం నాలు గుద్యోగా లున్నాయి. అందులో ఒకటి యస్టీ వోళ్లకి. అంటే నీకే నన్న మాట."

దొర మనసు ఆనందంతో నాట్యం చేయ సాగింది. హుషారుగా ముందుకు వంగి, "ఊ" అన్నాడు ఇంకా చెప్ప మన్నట్టుగా.

'ఆ ఉద్యోగం కచ్చితంగా నీకే వస్తుంది. వచ్చి తీరాలి. కానీ అది నీకు రావాలంటే, నేను తల్చుకోవాలి' అని ఆగాడు.

అతడి మాట లన్నీ అర్థ మయ్యాయి గానీ చివరి పదం, 'తల్చుకోవడమే' సరిగా అర్థం కాలేదు దొరకు.

'తనతో చెప్పడ మెందుకు? అతడే తల్చుకోవచ్చు కదా? అనుకున్నాడు మనసులో అనుకోడమే కాకుండా, " అయితే తల్చుకోండి" అన్నాడు దొర.

అతడు బ్రేవ్‌మని తేన్చి, " మీ కొం డోళ్లంత అమాయకులు కాబట్టే కొన్ని ఉద్యోగాల్ని మీకు కేటాయించింది ప్రభుత్వం. ఈ రోజు ఉద్యోగానికి కొచ్చిన వాళ్లలో బియ్యేలూ, ఎమ్మేలూ చదివిన వాళ్లున్నారు. వాళ్లు నీ కంటే ఎక్కువ చదూకున్నా వాళ్లకీ ఉద్యోగం వొస్తుందన్న గ్యారంటీ లేదు. కానీ నీకు మాత్రం గ్యారంటీగా ఆ ఉద్యోగం వస్తుంది. అందుకు నువ్వేం చేయాలంటే..." అని దొర ఏం చేయాలో చెప్పా డతడు.

అతడు చెప్పింది విన్నాక నీరసం ఆవహించింది దొరను.

ఇక్కడికి రావడానికి బస్సు ఛార్జీలే కష్ట పడి సంపాదించా డు తను. ఇక అత డడిగిన డబ్బు ఎక్కడి నుంచి తేగలడు? డబ్బు ఖర్చు పెడితేనే తన కీ ఉద్యోగం వచ్చే మాటైతే ఇందులో ప్రభుత్వం కేటాయించటం ఏవుంది?

సత్యం మాష్టారు చెప్పిన దాని పెకారం తమ జాతిలో చదువు కున్నోల్లు తక్కువ కనుక, ఎంత చిన్న చదువు చదువు కున్నా తమ కు సులభంగా ఉజ్జోగాలు వచ్చే ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఆ ఆశతోనే తను కష్ట పడి చదూకున్నాడు. మరి దేంటి?

దొర ఆలోచనలో పడడం చూసి, "ఇంటి కెల్లి బాగా ఆలోచించుకో! వచ్చే వారం ఇదే రోజుకి నే న్చెప్పిన డబ్బు తీసుకొస్తే ఆ ఉద్యోగం నీకే వస్తుంది. నే వెళ్తున్నాను. నే తిన్న వాటికి డబ్బు కట్టేసి నువ్వు ప్రస్తుతానికి ఇంటి కెల్లి పో" అని ఎవరో తరుముకొస్తున్నట్టు గబగబా అక్కడ నుంచి వెళ్లిపోయాడు ఆ వ్యక్తి.

మ్రాన్పడిపోయాడు దొర. ఉదయం నుంచీ ఏమీ తిన లే దతడు. అతడుతనను ఇడ్లీ తింటోవా? దోసెతింటావా? అని అడిగితే అతడే ఖర్చు పెడుతున్నాడేమో ననుకుని తను సిగ్గు పడ్డాడు. తీరా చూస్తే అతడు సిగ్గు లేకుండా తినేసి ఎల్లి పోవడమే కాక తననే డబ్బు కట్టమని చెప్పాడు.

జేబులు తడుముకున్నాడు దొర. చిల్ల రంతా పోగు చేసి హోటల్ వాడిచేతిలో పోశాడు. హోటల్ అతను, "ఇంకా అర్ధరూపాయి వస్తుంది" అన్నాడు.

దొర అతడి వైపు దీనంగా చూశాడు.

ఆ హోటల్ వాడు ఏమనుకున్నాడో, "సర్లే, చేతిలో డబ్బు ల్లేక ఎప్పుడూ రామాక" అన్నాడు.

బస్ స్టాండ్‌కు వెళ్లే అవసరం కనబడ లేదు దొరకు, అక్కడి నుంచి ఇరవై కిలో మీటర్లు రోడ్డు వెంబడి నడిచాక, మరో పన్నెండు కిలో మీటర్లు కాలి బాట వెంబడి నడిస్తేనే గానీ గూడెం చేరుకో లేదు. గూడెం వైపు నడక సాగించాడు దొర.

* * *

పట్నంలో మూడు గంటలకు బయల్దేరిన దొర రోడ్డు వెంబడి నడుచుకుంటూ చీకటి పడే వేళకు తమ గూడేనికి దారి తీసే కాలి బాట వద్దకు చేరుకున్నాడు.

అక్కడి నుంచి అంతా దట్టమైన అడవి. ఆకాశా న్నంటేలా ఎత్తుగా ఎదిగిన వృక్షాలూ, అల్లిబిల్లిగా అల్లుకున్న తీగలూ, ఎగుడు దిగుడుగా ఉండే దారీ, బయటి వారికె వరికైనా భీతావహం కలిగిస్తాయి.

దశమి నాటి వెన్నెల దివ్యంగా ఉన్నప్పటికీ, దట్టంగా ఉన్న చెట్ల మధ్య నుంచి కిందికి ప్రసరించే అవకాశమెంత మాత్రమూ లేదు. ఎప్పుడు దూరపు ప్రయాణం చేయాల్సి వచ్చినా గూడెం వాళ్లు కచ్చితంగా అగ్గి పెట్టె దగ్గర ఉంచుకుంటారు.

క్రూర మృగా లెదురైతే బెదర గొట్టేందుకు, చీకట్లో దారి చూసుకుందుకూ నిప్పు తప్పని సరి. ఆ బాట కిరు వైపులా అక్క డక్కడా వెదురు పొదలున్నాయి.

కాసేపు చుట్టూ తిరిగి వెదురు పొద ల్లోంచి బాగా ఎండిన వెదురు బొంగుల్ని పోగు చేశాడు దొర. తరువాత ఎండిన చితుకుల్ని పోగుచేసి నిప్పు రాజేశాడు. కాస్సేపట్లోనే చితుకులు అంటుకుని మండడం ప్రారంభించాయి. తను పోగు చేసిన వెదురు బొంగుల్ని నిలువుగా చీల్చి ముక్కలుగా చేసి, వాటి చివర్లను ఆ మంట మీద ఉంచాడు దొర. అయిదు నిముషాల్లో అవి బాగా అంటుకుని మండడం ప్రారంభించాయి.

## జోక్

### డెంటిస్టు ఫీజు

పిల్లవాడి పుప్పిపన్ను ఊడ బెఱికి నందుకు ఓ పంటి వైద్యుడు మూడు వందల రూపాయలు తల్లివద్ద వసూలు చేశాడు.

'ఉడదీసిన పన్ను ఒక్కింటికి మీరు అరవైరూపాయలే తీసు కుంటారని అందరూ అంటారే?' అని అడిగింది తల్లి.

" నా ఛార్జీలంతే ననుకోండి. కానీ పన్ను తీస్తున్నప్పుడు మీ పిల్లవాడు పెట్టిన వెర్రి కేకలకి, బయట కూచోనున్న నా నలుగురు కొత్త పేషంట్లు తారెత్తి పరుగెత్తి పోయారు" అన్నాడు దంతవైద్యుడు.

ఛాయ

కొన్ని వెదురు బొంగుల ముక్కల్ని భుజం మీద పెట్టుకుని, ఓ చేత్తో కదులుతున్న వెదుళ్లను పట్టుకుని, ఆ వెలుతుర్లో కాలి బాట వెంబడి నడక సాగించాడు.

అర గంట గడిచాక, చేతిలోని వెదురు కాగడా పూర్తిగా కాలి పోయే దశకు వచ్చాక, భుజం మీది కర్రల్ని కిందికి దించి, వాటిని వెలిగించి కాలి పోయిన వెదురు ముక్కల్ని బాట పక్కనే పారేసి ముందుకు సాగాడు దొర.

అలా రెండు సార్లు పాత కాగడాల స్థానంలో కొత్తవి తయారు చేసుకుంటూ గంటన్నర సేపు నడిచాడు. మరో అరగంట నడిస్తే గూడెం వస్తుంది.

'తను గూడెం ఎల్లి మొకం చూపించ గలడా? తన గురించే ఎంతో ఆత్రంగా ఎదురు చూసే సాంబవి కేం చెప్పగలడు ?' అతడి మనసును తిరిగి దిగులు ఆవహించిది. అ ప్రయత్నంగానే నడకలో వేగం తగ్గింది. కాలి కింది ఎండుటాకుల చప్పుడుతో అతడి గుండె చప్పుడు పోటీ పడుతోంది. మును పటంత వేగంగా నడక సాగడం లే దతడికి. ఏ క్రూర మృగమో వచ్చి తనను తినేస్తే బాగు ణ్ణనిపించ సాగిం దతడికి. కానీ మండుతోన్న కాగడా తన దగ్గ రున్నంత వరకూ ఏ జంతువూ తన దగ్గరకు రాదని అత గాడికి తెలుసు.

అతడి ఆలోచన లిలా సాగుతోండగా దగ్గర్లో కలకలం వినిపించింది. చెవులు రిక్కించి విన్నాడు దొర.

ఎవరో గుసగుసగా మాట్లాడుకుంటున్నట్టు వినిపిచిం దతనికి. వెలుగుతోన్న కాగడాను అన్ని వైపులకూ తిప్పి చూశాడు. కాగడాలు వెలుతురు పడినంత మేరా స్పష్టంగా కనిపిస్తోంది తప్ప, ఆ వెలుతురు కవతల ఏముందో తెలియడం లే దతడికి. ఈ సా రతడికి దగ్గర్లో స్పష్టంగా మాటలు వినిపించాయి. కాలి బాటను వదిలి అటు వైపు అడుగులు వేశాడు. ఎండుటాకుల చప్పుడు చాలా ఎక్కువగా ;ఎంతో మంది కంగారుగా పరుగెత్తుతున్నట్టుగా వినిపించిం దతడికి.

ఈ సమయంలో ఎవరూ అడవిలో తిరగరు. మరి తనకు వినిపించే మాట లెవరివ్వి?

"రక్షించండి . రక్షించండి..!." నాలుగైదు గొంతులు కలిసి పోయి బిగ్గరగా వినిపించా యతడికి. మరో అయిదు నిముషాల్లో కాగడాలు వెలుతుర్లో నలుగురు మనుషుల్ని చూశాడు దొర . అందరూ ఆడవాళ్లే!

వారి ఒంటి మీది దుస్తులు తళుక్కున మెరిసి పోతున్నాయి. కానీ వారి మొహాలు వాడి పోయి ఉన్నాయి. వా ళ్లందరికీ ధారాపాతంగా చెమట కారుతోంది. అందరి కళ్లలోనూ భయం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

వారి దగ్గరగా వెళ్లి "భయ పడకండి. మీకేం కాదు. నేనున్నాను" అన్నాడు దొర. తమ దగ్గరగా వచ్చిన అతణ్ని చూసి వారి మొహాల్లో ఆందోళన మరింత పెరిగింది. ఏమీ మాట్లాడకుండా అక్కడే ఉన్న ఓ బండ రాయి నానుకుని నిలబడ్డాడు దొర కాస్సేపు.

వాళ్లంతా విపరీతంగా రొప్పుతున్నారు. అంత వరకూ ""రక్షించండి. రక్షించండి" అని అరిచిన వాళ్లంతా ఎవరో మంత్రించినట్లుగా ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం చాలా వింతగా అనిపించిం దతడికి.

వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ, వెదురు కాగడా కాల్తోన్నపుడు వచ్చే సన్నటి ధ్వనీ తప్ప ఇంకేమీ వినిపించడం లేదు.

"ఎవరు మీ రంతా? ఈ సమయంలో ఈడి కెందు కొచ్చారు?" అన్నాడు దొర. ఈ సారి వాళ్లలో ఒకావిడ ధైర్యం చేసి అంది. "దారి తప్పి ఈ అడవిలో చిక్కుపడి పోయాం బాబూ. మమ్మల్ని రోడ్డుకు చేర్చావంటే నీ ఋణం ఉంచుకోం నాయనా! మా జీపు డ్రైవ రక్కడే ఎదురు చూస్తోంటాడు."

"మీకేం భయం లేదు. నాతో రండి" అని పక్కకు తిరిగి వేరే బాట వెంబడి నడిచాడు దొర. అతడు దారి చూపిస్తూ ముందు నడుస్తోంటే వాళ్లంతా అతడి వెనుక నడిచారు.

రోడ్డుకు చేరుకునే లోగా వాళ్లంతా అతడికి మంచి స్నేహితులైపోయారు. "మాకు దారి చూపించడం కోసమే ఆ మాయదారి వెధవ నీ డబ్బుల్తో టిఫిన్ తినుంటాడు" అం దొకావిడ, అతడు చెప్పిన ఇంటర్వ్యూ కథంతా విన్నాక.

తన స్నేహితురాళ్లు అడవి చూడాలని ఉబలాట పడితే రోడ్డు వరకూ జీపులో వచ్చి, అక్కడి నుంచి అడవిలోకి నడిచి వచ్చారనీ, జీపు డ్రైవరు తమతో వస్తానంటే వద్దని వారించి అలా అలా నడుచుకుంటూ దారి తప్పారనీ చెప్పి, రెం డ్రోజులాగి తమ ఊరికి వస్తే తన భర్తతో చెప్పి ఏదో ఒక ఉద్యోగం తప్పకుండా ఇప్పిస్తాననీ వాగ్దానం చేసింది వాళ్లలో ఒకావిడ.

ఆవిడ ఆ ఏరియాకు కొత్తగా వచ్చిన సంక్షేమ అధికారి భార్యట.

వాళ్లను రోడ్డు మీదికి చేర్చే సరికి ఆందోళనతో ఎదురు చూస్తోన్న డ్రైవర్ కనిపించాడు. వారి నందర్నీ చూస్తూనే అతడు ఎగిరి గంతు లేసి నంత పని చేశాడు. విషయం తెల్సుకుని దొరను దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నాడు.



వా ళ్లందరూ దొర వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసి సెలవు తీసుకున్నారు.

అధికారి భార్య, "దొరా, రావడం మర్చిపోకేం?' ' అని చివరగా చెప్పింది జీపులో కూర్చుంటూ.

దొర సంతోషంగా తలూపాడు.

రెండు రోజుల తర్వాత పట్నం బయల్దేరాడు దొర. ఈ సా రతడి మనసులో బెరుకు లేదు. ఏమౌతుందో అనే దిగులు లేదు. దర్జాగా బస్ దిగి అమ్మగా రిచ్చిన చిరునామా ప్రకారం బంగళాకు చేరుకున్నాడు.

నేరుగా లోపలకు వెళ్లబోతోంటే గేట్ దగ్గర గూర్ఖా ఆపు ఛేశాడు. అతడి భాష అర్థం కాక ఇబ్బంది పడ్డాడు దొర.

ఎంత చెప్పినా వినిపించుకోకుండా, "నయ్.. నయ్.." అంటూ దొరను వెనక్కు నెట్టేశాడు గూర్ఖా. గేట్ సందుల్లోంచి ఎవరైనా కనబడతారేమోనని చూసిన దొరకు నిరాశే మిగిలింది. చేసేది లేక గేట్ బయటే రాతి చప్టా మీద కూర్చున్నాడు.

కా స్సేపటికి ఒకతను వచ్చి పలకరించాడు. "ఏం దొరా బాగున్నావా?" అంటూ. ప్రాణం లే చొచ్చింది దొరకు.

ఆ రోజు కనిపించిన జీపు డ్రైవర్ నక్కడ చూడడంతో అతడి కళ్లలోకి ఆనందం వెల్లువలా తోసుకొచ్చింది.

"చూడు. వీడు నన్ను లోపలికి పోనివ్వడం లేదు" అన్నాడు దొర, గూర్ఖాను చూపించి.

డ్రైవర్ నవ్వి, "వాడేం చేస్తాడులే! వాడి ఉద్యోగ మది. అయినా అమ్మగారు ఊళ్లో లేరు" అన్నాడు.

దొరను తిరిగి నిస్పత్తువ ఆవహించింది.

"అమ్మగారు లేరా? న న్నివ్వాళ రమ్మన్నారే!' ' అన్నాడు దిగులుగా చూస్తూ.

"నిన్ను రమ్మనడం నిజమే గానీ అమ్మ గారికి ఊర్నించి టెలిగ్రాం వస్తే అర్జంట్‌గా వెళ్లి పోయారు. మరో పది రోజుల వరకూ రారు" అన్నాడు డ్రైవర్ జాలిగా చూస్తూ.

"అయ్య గారూ?" అన్నాడు దొర ఆశగా.

"అయ్య గారు మీటింగ్‌కి హైదరాబాద్ వెళ్ళారు. నా ల్రోజుల వరకూ రారు."

కాళ్లీడ్చుకుంటూ బస్ స్టాండ్‌కు బయల్దేరాడు దొర.

'ఆ రో జెంత నమ్మకంగా చెప్పింది అమ్మగారు? ఛీ.. ఛీ.. ఈ పట్న పోల్ల నసలు నమ్మ కూడదు. ఒకల్ల నుంచి సాయం పొందడమే తప్ప సాయం చేసే బుద్ధి ఈల్లకు లేదు. ఈల్ల న్నమ్ముకోడం తన్దే తప్పు.'

దిగాలు పడిన మనసుతో గూడేనికి చేరుకునే సరికి శాంభవి ఎదు రొచ్చిం దతడికి. అతడి మొహం చూడగానే విసయం అర్థమై పోయిం దామెకు.

'ఈ ఉజ్జోగాలు మన కెందుకు దొరా? నన్ను మనువాడి ఆయిగా జొన్న సేను సాగు చేసుకుంటూ బతకొచ్చు కదా?' అంది అనునయంగా.

"చస్.. నోర్ముయ్!" అని కసిరాడు దొర.

"దా న్నెందుకురా అట్టా కసురుకుంటావ్! అచ్చెప్పిం దాంటో త ప్పేటుందిరా?" అంది అప్పటి వరకూ వా ళ్లిద్దర్నీ గమనిస్తోన్న దొర తల్లి.

"నువ్ కూడా నోరుముయ్!" అని గట్టిగా అరిచాడు దొర.

పది రోజుల తర్వాత తిరిగి పట్నానికి బయల్దేరాడు దొర.

'ఈ సారి అమ్మ గారున్నా, లేక పోయినా అయ్యగార్ని కల్సుకోవాలి. తన నెందుకు ఇట్టా మోసం చేత్తన్నారో నిలదీసి అడగాలి!'

దృఢ నిశ్చయంతో అయ్య గారి బంగళా వద్దకు చేరుకున్నాడు దొర.

ఎప్పటిలానే గూర్ఖా, "నయ్.. నయ్..' అన్నాడు.

అందుకు సమాధానంగా దొర, "కుయ్.. కుయ్.." అన్నాడు.

దొర గూర్ఖాతో మాట్లాడుతోండగా ఇంట్లోంచి బయటకు వచ్చాడు మహర్షి. కాస్సేపు వా ళ్లిద్దర్నీ గమనించాక గూర్ఖాతో చెప్పా డతన్ని లోపలికి రానివ్వ మని.

రెండు చేతులూ జోడిస్తూ లోపలికి వచ్చిన దొరను ప్రశ్నార్థకంగా చూశాడు మహర్షి.


"నమస్కారం సార్, అమ్మగారు కావాలి" అన్నాడు దొర, ఏ ఉపోద్ఘాతమూ లేకుండా.

మహర్షి ఆశ్చర్యపోయాడు. అతడి వైపు ఎగాదిగా చూస్తూ. "అమ్మ గారితో నీకేం పని?" అన్నాడు నొసలు చిట్లిస్తూ.

"ఏనంటే.. మొన్న అడవిలో.. అమ్మగారు రమ్మని చెప్పారు" అన్నాడు దొర తడబడుతూ.

మహర్షి కేమీ అర్థం కాలేదు. "అడ వంటావ్.. అమ్మ గారంటావ్.. అసలు నీకేం కావాలి?" అన్నాడు మహర్షి గొంతు పెంచి.

## కిటుక్కు



**సెలవులు కదా!**
**పిల్లలు చుట్టాలిళ్లకు**
**వెళ్లడం మామూలే.**
**బట్టలపై ఏవో మరకలు**
**పడడం మామూలే.**
**బాధపడకండి. ఆస్ప్రిన్**
**టాబ్లెట్లు నాన వేసిన**
**నీళ్లతో ఉతికితే**
**తలనొప్పిలానే, మరకలూ**
**మాయం!**

అమ్మ గారేమీ చెప్ప లేదని అర్థమైంది దొరకు. విషయమంతా వివరంగా చెప్పాడు.

అంతా విన్నాక మహర్షి మొహంలోకి నవ్వు ప్రవేశించింది. "నువ్వేనా అమ్మ గార్ని రోజు రాత్రి రోడ్డుకు చేర్చింది? లోపలికి రా. అమ్మ గారు చెప్పార్లే! నేనే మర్చిపోయాను" అంటూ ఇంట్లోకి నడిచాడు మహర్షి.

మహర్షి వెనుక ఇంట్లోకి ప్రవేశించాడే గానీ దొర కళ్లు అమ్మ గారి కోసం వెతుకుతూనే ఉన్నాయి.

అతడి చూపుల్ని గమనించి, 'అమ్మ గా రూళ్లో లేరోయ్' అన్నాడు మహర్షి సోఫాలో కూర్చుంటూ.

అమ్మ గా రొచ్చే వరకూ ఆగితే మళ్లీ ఈ అవకాశం రాదని, తెగించి చెప్పాడు దొర, తన మనసులోని విషయాన్ని.

అంతా విన్నాక అన్నాడు మహర్షి, "అయితే నీ కుద్యోగం కావాలన్న మాట."

'మీ దయ..' అన్నట్టుగా చూశాడు దొర ఆశగా.

"ఏదో తరగతికేం ఉద్యోగం వస్తుందయ్యా? అయినా ఇంకా చిన్న వయసేగా? చదువుకో.. నేనేర్పాటు చేస్తాను" అన్నాడు మహర్షి.

దొరకు ఎక్కడ లేని కోపమూ వచ్చింది.

"మీ పట్నపోల్లంతా ఇంతే! చేయ గలిగిన సాయం చేయడం మానేసి ఇంకేదో చెవుతారు. మొన్నటికి మొన్న ఇదే పట్నాని కుజ్జోగం కోసరం వత్తే నన్ను కొండ జాతోడని ఈసడించుకుని, ఆ ఉజ్జోగం నాకు రావాలంటే డబ్బిమ్మన్నారు నన్ను. కూటి గ్గతి లేనోల్లం డబ్బు లెక్కణ్నించి తెచ్చియ్య

*(తరువాయి 27వ పేజీలో)*

(17వ పేజీ తరువాయి)

గలం? అమ్మగారు మీతో చెప్పి ఉజ్జోగం ఇప్పిత్తానంతే వొచ్చాను. చేతనైతే ఉజ్జోగం ఇప్పిచ్చండి. లేకపోతే ఊరుకోండి. నే నిట్నించిటే ఎల్లి అన్నల్లో కల్సిపోతాను. అప్పుడు గానీ నన్ను పిల్సి మీ ప్రభుత్వం ఏదో ఏర్పాటు చెయదు. ఇంకా చదూకోమని మాత్తరం చెప్పకండి. అయినా ఇంకా చదూకుని నేనేం చేయాలి? చి న్నుజ్జోగానికి కావల్సిన డబ్బే నా దగ్గర్లేదు. ఇంకా చదివి ఎక్కువ డబ్బు ఏడ్నించి తేను?

"అయినా కొండ జాతోల్లని అబిరుద్ది చేయమని ప్రభుత్వం మీకుజ్జోగంఇత్తే మీ రేం చేత్తన్నారు? మా గూడేని కీ రోజుకీ రోడ్డుందా? స్కూలుందా? ప్రబుత్వంవూ మీరూ అంతా బూటకం!" అన్నాడు ఆవేశంగా.

ఉలిక్కి పడ్డాడు మహర్షి.

'ఇట్నించిటే ఎల్లి అన్నల్లో కల్సి పోతాను' అనేమాట లతణ్ని బాగా కలవర పెట్టాయి. ఎంతో భవిష్యత్తు ముందున్న దొర వంటి యువకులు నిరాశానిస్పృహలు చుట్టు ముట్టినపుడు గత్యంతరం లేక, ఎటువంటి దారి నెన్నుకుంటారో ఆ క్షణంలో అర్థమైం దతడికి.

రోగాన్ని నయం చేసేందుకు ప్రయత్నించడం కంటే, అసలు రోగం రాకుండా జాగ్రత్త తీసుకోవడం ఎంత అవసరమో తెలి సొచ్చిం దతడికి.

ఉద్యోగం తెచ్చిన అనుభవంతో చిరునవ్వు తెచ్చిపెట్టుకుని అన్నాడు మహర్షి.

"అభివృద్ధనేది ఒక రోజులో వచ్చేది కాదయ్యా. మీ తాతల నాడు ఈ పట్నం రావాలంటే నడ కొక్కటే మార్గం. ఇప్పుడు సగం దూరం బస్సులో రావచ్చు కదా? మీ పిల్లలు పెద్ద వాళ్లయే సరికి మీ ఊరికీ రోడ్డొస్తుంది. బస్సులు అక్కడి వరకూ నడుస్తాయి.

"నువ్వు పది కిలో మీటర్లు నడిచి స్కూల్‌కి వెళ్లి చదువుకున్నావు. నీ పిల్లలు చదువుకునే సమయానికి మీ గూడెంలోనే స్కూల్ ఏర్పడొచ్చు. మీ తాతల కాలంలో పట్నపు జనం ఎవరైనా గూడేలకు వస్తే అంతా పారిపోయి దాక్కునే వారు.

"మీ తండ్రి తరం వాళ్లెవరూ ప్రభుత్వాధికారుల్ని కల్సుకుని మాట్లాడి ఎరుగరు. నువ్వు పట్నం వచ్చి నా తోటి అధికారుల్ని కల్సుకుని మాట్లాడ గలుగుతున్నావు. నీ మనసులోని బాధను ధైర్యంగా చెప్ప గలుగుతున్నావు.

"ఇదంతా అభివృద్ధి కాదూ? మీలో నువ్వు చదివిన పాటి చదువు కూడా చదివిన వా రెవరూ లేరు. అందుకే నిన్నింకా చదువుకుని వృద్ధిలోకి రమ్మన్నానే తప్ప మరో ఉద్దేశంతో కాదు. నీకు తగ్గ ఉద్యోగ మిప్పించడం నాకు కష్టంకాదు. ఆలోచించుకో! ఉద్యోగం చేస్తావో, ఇంకా చదువుకుని పైకి వస్తావో!"

"ముందు నా కుజ్జోగం ఇప్పిచ్చండి. ఉజ్జోగం చేస్తూ చదూకుంటాను" అన్నాడు దొర, తన నిర్ణయంలో మార్పు లేదన్నట్టుగా.

ఉద్యోగం చేస్తూకూడా చదువు కొనసాగించ వచ్చుననే చిన్న విషయం తన కా సమయంలో తట్టనందుకు సిగ్గు పడడం మహర్షి వంతయింది.

'ఎవ రన్నారు గిరి జనులు అమాయకులని? సరైన దారిలో నడిపించే వారు లేక దొర వంటి వారు అడవిలోనే పుట్టి, అడవిలోనే నశించి పోతున్నారు గానీ కాస్త తోడ్పాటు అందిస్తే, జనారణ్యంలోకి వచ్చి తమ సత్తా నిరూపించుకోరూ?

సారవంతమైన నేలా, సూర్యరశ్మి, తేమా ఉన్నప్పటికీ, ఆలంబన లేందే ఎంత గొప్ప జాతి మల్లె తీగైనా తన అస్తిత్వాన్ని కాపాడుకోలేదు. అటువం టప్పుడు అడవిలో పుట్టిన దొర వంటి వారికి చేయూత నివ్వందే పైకి ఎలా వస్తారు?

దొర వైపు ముచ్చటగా చూసి, అతడి భుజం తడుతూ సంతోషంగా తలూపాడు మహర్షి.

